# నీటి పంపకాలు ఖరారు

- తుంగభద్ర బోర్డు ఎస్‌ఈల సమావేశం
- 105 టీఎంసీలను మూడు రాష్ట్రాలకు కేటాయింపు
- ఆర్డీఎస్‌కు 3.224, కేసీ కెనాల్‌కు 4.096 టీఎంసీల నీటి కేటాయింపు



తుంగభద్ర బోర్డు సమావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల ఎస్‌ఈలు

అయిజ, అక్టోబర్ 5 : వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఆర్డీఎస్ ఆయకట్టుకు 3.224 టీఎంసీల నీటిని కేటాయిస్తూ తుంగభద్ర బోర్డు ఎస్‌ఈలు నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వచ్చిన వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని 2023–24 ఏడాదికి గానూ 105 టీఎంసీలు వస్తాయని బోర్డు అధికారులు అంచనా వేశారు. 105 టీఎంసీలను తెలంగాణ, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ (కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్) కేటాయింపులకు అనుగుణంగా దామాషా పద్ధతి ప్రకారం నీటి పంపకాలు చేశారు. గురువారం కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం అతిథి గృహంలో తుంగభద్ర బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎస్‌ఈలు, ఈఈలతో సమావేశం నిర్వహించారు. తుంగభద్ర నదీ పరివాహక రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ 212 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు నీటి కేటాయింపులు చేపట్టింది. కర్ణాటకకు 138.990, ఏపీకి 66.500, ఆర్డీఎస్‌కు 6.510 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అవకాశం ఉన్నది. నాలుగైదు ఏండ్లుగా తుంగభద్ర నదికి వస్తున్న వరదలను దృష్టిలో ఉంచుకుని 2023–24 ఏడాదిలో తుంగభద్ర నదికి 105 టీఎంసీల నీరు వస్తుందని అంచనా వేశారు. 2023 జూన్ 8న జరిగిన సమావేశంలో తుంగభద్ర బోర్డు ఎస్‌ఈల సమావేశంలో 175 టీఎంసీలు వస్తాయని అంచనా వేసినప్పటికీ వానలు సమృద్ధిగా కురవకపోవడంతో డ్యాంకు వరద తగ్గిపోయింది. దీంతో అంచనాలను సవరించి ప్రస్తుతం వచ్చిన వరద నీటిని మూడు రాష్ట్రాలకు పంపిణీ చేశారు. వరద అంచనాలను బట్టి కర్ణాటకకు 68.839, ఏపీకి 32.936, తెలంగాణ రాష్ట్రంలోని ఆర్డీఎస్ 3.224 టీఎంసీలను వినియోగించుకునేందుకు నిర్ణయం తీసుకున్నారని ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో గద్వాల ఎస్‌ఈ శ్రీనివాసరావు, అనంతపురం ఎస్‌ఈ రాజశేఖర్, కర్నూల్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, కర్ణాటక ఈఈ బస్వరాజు, ఎస్‌డీవో హసన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ముగిసిన గురుకుల ఉమ్మడి జిల్లా క్రీడోత్సవాలు
- విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, అక్టోబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతులు గురుకుల పాఠశాలలో నాలుగు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి అండర్–14, అండర్–19 బీసీ గురుకుల విద్యాసంస్థల క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు షీల్డ్‌తోపాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలకు పెద్దపీట వేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నిధులు కేటాయిస్తున్నారన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకొని మరింతగా రాణించాలని సూచించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఎక్కువ మొత్తంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ మనోహర, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, గురుకులాల ఆర్‌సీవో లింగయ్య, ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.

***విజేతలకు బహుమతులు..***

అండర్–19 విభాగంలో వాలీబాల్‌లో పుల్లూర్ క్రీడాకారులు మొదటి స్థానం, ఉయ్యాలవాడ ద్వితీయ స్థానం సాధించారు. కబడ్డీలో ఉయ్యాలవాడ మొదటి స్థానం, వెల్టూర్ రెండో స్థానం దక్కించుకున్నారు. ఖోఖోలో ఉయ్యాలవాడ మొదటి స్థానం, భూత్పూర్ రెండో స్థానం, టెన్నికాయిట్‌లో కల్వకుర్తి మొదటి, ఉయ్యాలవాడ రెండో స్థానం సాధించారు. క్యారమ్స్‌లో తాడూర్ మొదటి, కల్వకుర్తి రెండో స్థానం సాధించారు. అండర్–14 విభాగంలో వాలీబాల్‌లో కల్వకుర్తి మొదటి, భూత్‌పూర్ రెండో స్థానం, కబడ్డీలో కల్వకుర్తి మొదటి స్థానం, ఊర్కొండపేట రెండో స్థానం, ఖోఖోలో కల్వకుర్తి మొదటి స్థానం, ఊర్కొండపేట రెండో స్థానం సాధించారు. చెస్‌లో కోడేరు మొదటి స్థానం, కల్వకుర్తి రెండో స్థానం సాధించారు. అనంతరం కల్వకుర్తి మండలం వేపూర్‌లో నూతన పాఠశాల భవనానికి, నీటిశుద్ధి కేంద్రానికి ప్రారంభోత్సవం, సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్ మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- ఎస్వీఎస్ దవాఖాన చైర్మన్ కేజే రెడ్డి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 5 : దేశంలో 7కోట్ల మంది ఆర్థరైటిస్ (మోకాళ్లు, కీళ్ళ) నొప్పులతో బాధపడుతున్నారని, ప్రతిఒక్కరూ రోజూ వాకింగ్ చేయడం వల్ల చాలా వరకు నియంత్రించవచ్చునని ప్రముఖ ఆర్థోపెడిక్, ఎస్వీఎస్ దవాఖాన, మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ కేజే రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆర్థోరైటిస్ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తూ వాకింగ్ కార్యక్రమాన్ని దవాఖాన రెసిడెన్సీ డైరెక్టర్ రాంరెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులతో కలిసి నిర్వహించారు. అనంతరం దవాఖానలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కేజే రెడ్డి మాట్లాడుతూ.. మోకాళ్ల నొప్పులు 80శాతం మందికి వస్తున్నాయన్నారు. మనిషి జీవన విధానంలో మార్పు రావాలని, ప్రతిఒక్కరూ సులభమైన వాకింగ్ చేయడం వల్ల మోకాళ్లు, కీళ్ల నొప్పులు, జీర్ణవ్యవస్థ, షుగర్, గుండె నొప్పులు, బీపీతోపాటు చాలా రోగాలు నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి రోజూ 45నిమిషాలపాటు వాకింగ్ చేయాలని సూచించారు. వారం రోజులపాటు ఆర్థరైటిస్ సమస్యలు ఉన్నవారికి ఉచితంగా ఎస్వీఎస్ దవాఖానలో పరీక్షలు అందిస్తామన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి అధునాతన పరికరాలతో రూ.లక్షతో కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో వేణు, ఆర్థోపెడిక్ వైద్యుడు లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థరైటిస్ అవగాహన వాకింగ్‌లో పాల్గొన్న ఎస్వీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి

# జైలుకెళ్లినాతీరు మారలే..

- వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్
- 21 కేసుల్లో నిందితుడు
- 8తులాల బంగారం, 5 బైక్‌లు స్వాధీనం
- ఎస్పీ కె.నరసింహ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 5 : చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడిని అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ తెలిపారు. గురువారం సాయంత్రం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. కల్వకుర్తి మండలం జీడిపల్లికి చెందిన బాషమోని సైదులు జూన్ 2వ తేదీన అర్ధరాత్రి జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూరెడ్డిపల్లిలో రవికుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సైదులు తన సహచరిణి జడ్చర్లకు చెందిన కొంగలి అంజలితో కలిసి గురువారం ఉదయం స్థానిక వంశీ దవాఖాన వద్ద పల్సర్ బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా, దొంగతనాలకు పాల్పడిన వివరాలను వెల్లడించినట్లు ఎస్పీ చెప్పారు. నిందితుడి నుంచి 8తులాలు బంగారు ఆభరణాలు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా, సైదులు 1995 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. తాళం వేసిన ఇండ్లలోనే కాకుండా బైక్‌లను దొంగలించినట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. నిందితుడిపై మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 21 కేసుల్లో నిందితుడు ఉండగా, జైలుకెళ్లొచ్చినట్లు తెలిపారు. చిన్నతనం నుంచి దొంగతనాలు చేయడమే కాకుండా భార్య చావుకు కారకుడై జీవిత ఖైదు పడి బెయిల్‌పై వచ్చి నేరాలకు పాల్పడుతున్నా డు. ఇటీవల జడ్చర్లలో తన సహచరిణి అంజలితో కలసి ఓ బాలికను కిడ్నాప్ చేసిన నేరంపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. వరుస దొంగతనాలు చేస్తూ ప్రజలకు భయాందోళనలు సృష్టిస్తున్న నిందితుడు సైదులు మోస్ట్‌వాంటెండ్‌గా ఉ న్నట్లు చెప్పారు. జడ్చర్ల సీఐ రమేష్‌బాబు నేతృత్వం లో పోలీసు సిబ్బంది కష్టపడి నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితుడు సైదులుతోపాటు అతనికి సహకరించిన అంజలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్పీ వివరించా రు. నిందితుడిని పట్టుకున్న పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేశారు. సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ మహేశ్, సీఐ రమేశ్‌బాబు, ఎస్సైలు చంద్రమోహన్, నాగరాజు పాల్గొన్నారు.

## వేములలో ఆరుగురికి పోలీసు ఉద్యోగాలు



పరుశరామ్



రమేశ్




యాదయ్య



నాగలక్ష్మి



అర్జున్‌గౌడ్



ఓం ప్రకాశ్‌గౌడ్

మిడ్జిల్, అక్టోబర్ 5 : మండలంలోని వేములకు చెందిన ఆరు మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ఫలితాల్లో గ్రామానికి చెందిన పరశురాము, రమేశ్, యాదయ్య, నాగలక్ష్మి, అర్జున్‌గౌడ్, ఓంప్రకాశ్ గౌడ్ ఎంపికయ్యారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన వారు రమేశ్, యాదయ్య, నాగలక్ష్మిలకు పోలీసు ఉద్యోగాలు వరించాయి. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉప్పునుంతలలో నలుగురు..



మనీషా



వేణుగోపాల్



మదనాగుల మల్లేశ్



మెగమోని మల్లేశ్

ఉప్పునుంతల, అక్టోబర్ 5 : మండల కేంద్రానికి చెందిన నలుగురు ఎంపికకావడంతో వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఉప్పునుంతలకు చెందిన మనీషా, మదనాగుల వేణుగోపాల్, మదనాగుల మల్లేశ్, మెడమోని మల్లేశ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామయ్యే పోలీసు విధుల్లో చేరడం ఆనందంగా ఉందని, బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. అనంతరం కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి గ్రామస్తులు అభినందించారు.